గ్రంథాలయం పనులు వెంటనే ప్రారంభించాలి

- శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

విశ్వంభర, ఎల్బీనగర్ : దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ఎన్జీవోస్ కాలనీ లోనే గ్రంథాలయం పనులు బుధవారం నుండి ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. కాలనీవాసులందరు కలిసి లైబ్రరీ గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా కాలనీవాసులు అందరు గ్రంథాలయం పనులు వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే ని కోరడం జరిగింది.స్పందించిన ఎమ్మెల్యే గ్రంథాలయం పనులు తాను ఎప్పుడు ఆపలేదని కొందరు బి.జె.పి.కార్పొరేటర్ల దుందుడుకు చర్యల కారణంగా పనులు నిలిచిపోయాయని తెలిపారు.గ్రంథాలయం పనులు బుధవారం నుండి ప్రారంభించాలని అక్కడే ఉన్న గ్రంథలయం ఈ.ఈ, డి.ఈ.ను అదేశించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎన్జీవోస్ కాలనీ వాసులు సోమయాజులు,పంపన్న వెంకటేశ్వర,శివ నాగేశ్వర్ రావు,వేముల జైపాల్ రెడ్డి,వర్ధని,శశిధర్ రెడ్డి, ఓంప్రకేష్, భూషణ్, విశ్వనాథం, శ్యాంకుమార్,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రి అనితను మర్యాదపూర్వకంగా కలిసిన రామకృష్ణ

విశ్వంభర, హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత ను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రముఖ సామాజిక సేవకుడు రామకృష్ణ అల్లా. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల శాంతి భద్రతల పరిరక్షణలో మీరు చూపుతున్న చొరవ అభినందనీయమని అన్నారు. మీ సేవలు రాష్ట్ర ప్రజలకు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాయి. మీ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి సాధిస్తుందని అని తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం మీరు చేస్తున్న కృషి అభినందనీయం అని, మీ సేవా స్ఫూర్తి యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీలో

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

విశ్వంభర, తార్నాక : తెలంగాణ ఉద్యమ భూమిక, ప్రపంచ విద్యా తోరణం, దేశంలో అత్యున్నత విద్యా నిలయం, చదువుల తల్లి ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి కొరకు తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించడంపై యావత్ తెలంగాణ ప్రజానికంతో పాటు, విద్యార్థి విభాగాలు, ఉస్మానియా విద్యార్థులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ బడ్జెట్లో ఉస్మానియా క్యాంపస్కి అధిక నిధులు కేటాయించడం పట్ల ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ లీడర్, ఏఐసీసీ కోఆర్డినేటర్, కాంగ్రెస్ సేవాదళ్ విభాగం జనరల్ సెక్రటరీ బొల్లారం టీ నిరంజన్ యాదవ్ ఆధ్వర్యంలో ఉస్మానియా విద్యార్థులు పాలాభిషేకంతో పాటు, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో కీలక నాయకులు శ్రవణ్ యాదవ్, వంశీ, నవీన్ నాయుడు, ప్రశాంత్ వర్మ, కోటేశ్వరరావు రజక,ఓంకార్, శ్రవణ్,వీరబాబు, క్రాంతి నాయక్, తదితర నాయకులు పాల్గొన్నారు.

సురారం జెడ్పీహెచ్ఎస్ లో 'సలాడ్స్ & మిల్లెట్స్' వర్క్షాప్

విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి: నేటి బాలలే రేపటి పౌరులు, వారు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందనే సంకల్పంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం సురారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో "సలాడ్స్ & మిల్లెట్స్" (తృణధాన్యాలు) పై అవగాహన సదస్సు, వర్క్షాప్ ఘనంగా నిర్వహించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి మెతుకు పురుషోత్తం రెడ్డి గారు విద్యార్థులు ఉపాధ్యాయులు తయారు చేసిన పోషక విలువలతో కూడిన సలాడ్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు ఇలాంటి పౌష్టికాహారంపై అవగాహన కల్పించడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులను ఉత్సాహపరుస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గైడ్ టీచర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ వర్క్షాప్ నిర్వహణలో క్రియాశీలక పాత్ర పోషించిన గైడ్ టీచర్లు మరియు సీనియర్ ఉపాధ్యాయులను ఎంఈఓ అభినందించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల విదేశీ పర్యటన ఖరారు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అంతర్జాతీయ స్థాయి విద్యా విధానాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుంది. ఉపాధ్యాయుల వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరచడం, ప్రపంచ స్థాయి ఉత్తమ బోధనా పద్ధతులను అధ్యయనం చేయడం కోసం చేపట్టిన 'టీచర్స్ ఎక్స్పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్'లో భాగంగా విదేశాలకు పర్యటనకు వెళ్లే 28 మంది ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల జాబితాను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ వెల్లడించారు. ఏప్రిల్ 20 నుండి 24 వరకు తెలంగాణ నుండి మొత్తం 40 మంది ప్రతినిధులు (ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు) నాలుగు దేశాలైన ఫిన్లాండ్, సింగపూర్, వియత్నాం, జపాన్ దేశాలను సందర్శించనున్నారు.ప్రస్తుతం ఫిన్లాండ్ పర్యటన కోసం హెడ్ మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్లు , సెకండరీ గ్రేడ్ టీచర్లతో కూడిన 28 మంది సభ్యుల జాబితాను ఖరారు చేశారు. ఈ జాబితాలో కరీంనగర్, మహబూబాబాద్, మెదక్, ఖమ్మం, మంచిర్యాల, సంగారెడ్డి, హైదరాబాద్, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, మేడ్చల్ మల్కాజిగిరి, సిద్ధిపేట, భద్రాద్రి కొత్తగూడెం, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, నల్గొండ, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు ఉన్నారు. ఎంపికైన ఉపాధ్యాయులకు వీసా ప్రాసెసింగ్ , ఇతర సూచనలపై అవగాహన కల్పించేందుకు నేడు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ (ఆన్లైన్) ఓరియంటేషన్ నిర్వహించనున్నారు. ఎంపికైన వారు పర్యటనకు అవసరమైన పత్రాలతో సిద్ధంగా ఉండాలని ఆర్జేడీలు, డీఈఓలను ఆదేశించారు.



శుభ క్షేత్ర పేరిట 'అశుభ' మాయాజాలం

- పటాన్చేరులో కోట్లాది రూపాయల మోసం!
- సభ్యత్వాల పేరిట రూ. 5 లక్షల చొప్పున వసూలు
- 32 మంది బాధితుల ఆవేదన; పోలీసులకు ఫిర్యాదు
- ప్రధాన నిందితులు హేమకాంత్ రెడ్డి, బండి శివకుమార్ పరారీ

విశ్వంభర, సంగారెడ్డి : అమాయక ప్రజల ఆశలను పెట్టుబడిగా మలుచుకుని, రియల్ ఎస్టేట్ మరియు క్యాష్బ్యాక్ ఆఫర్ల పేరిట "శుభ క్షేత్ర కంపెనీ" నిర్వహించిన ఘరానా మోసం పటాన్చేరులో వెలుగులోకి వచ్చింది. భారీ లాభాలు, స్థలాల ఆశ చూపి సుమారు 32 మంది బాధితుల నుండి కోట్లాది రూపాయలు వసూలు చేసి నిందితులు చేతులెత్తేశారు.బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హేమకాంత్ రెడ్డి మరియు బండి శివకుమార్ అనే వ్యక్తులు కలిసి ఈ మోసానికి తెరలేపారు. రామావత్ మధు అనే వ్యక్తిని కంపెనీ చైర్మన్గా చూపిస్తూ బాధితులను నమ్మించారు. ప్రతి సభ్యుడి నుంచి రూ. 5 లక్షలు వసూలు చేశారు. ఈ మొత్తాన్ని 'గోకుల నందన ఇన్ఫ్రా కంపెనీ' ఖాతాలో జమ చేయించి, ఆ తర్వాత చాకచక్యంగా హేమకాంత్ రెడ్డి కుమార్తె పేరిట ఉన్న 'బృంద శ్రీ ఇంజనీరింగ్ వర్క్స్' ఖాతాకు మళ్లించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధితులను ఆకర్షించడానికి నిందితులు అద్భుతమైన ఆఫర్లను ప్రకటించారు:నారాయణఖేడ్ పరిధిలో 102 గజాల స్థలం,42 నెలల పాటు నెలకు రూ. 25,000 క్యాష్బ్యాక్,రూ. 5 లక్షల ప్రమాద బీమా పాలసీ.ప్రారంభంలో కేవలం ఒక నెల మాత్రమే రూ. 25,000 చెల్లించి, ఆపై మొహం చాటేశారు. బాధితులను నమ్మించడానికి వీరు గోవా టూర్లు, రిసార్టులలో విందు భోజనాలు ఏర్పాటు చేసి బురిడి కొట్టించారు.నిందితులు తెలివిగా అగ్రిమెంట్ పత్రాలను రామావత్ మధు పేరిట సిద్ధం చేసి, సంతకాలు మాత్రం హేమకాంత్ రెడ్డి, బండి శివకుమార్లే చేశారు. తీరా డబ్బులు అడిగితే.. తమకు సంబంధం లేదని, అంతా మధు చూసుకుంటాడని బెదిరింపులకు దిగుతున్నారు. ప్రస్తుతం హేమకాంత్ రెడ్డి పటాన్చేరు నుండి పరారైనట్లు సమాచారం. అందింది.తాము మోసపోయామని గ్రహించిన 32 మంది బాధితులు పటాన్చేరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తమకు న్యాయం చేయాలని, కష్టపడి సంపాదించుకున్న డబ్బును తిరిగి ఇప్పించాలని బాధితులు ఈ సందర్భంగా మీడియా వేదికగా కోరుతున్నారు.

నిరంతర యజ్ఞంలా సీఎం కప్

- తెలంగాణ మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తాం
- క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తాం
- సీఎం కప్ రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకల్లో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : తెలంగాణ మట్టి లోని మాణిక్యాల క్రీడా ప్రతిభను సానపెట్టేందుకే సీఎం కపూర్ పోటీ నిర్వహించామని ఇది ఒక నిరంతర కార్యక్రమంలో గా కొనసాగిస్తామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈరోజు ఎల్బీ ఇండోర్ స్టేడియంలోరెండవ విడత సీఎం కప్ పోటీల ముగింపు ఉత్సవాలు రాష్ట్ర స్థాయి వివరాలు ఛాంపియన్షిప్ టీమ్లకు ప్రోసీల బహుకరణ జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న మట్టిలో మాణిక్యాలను గుర్తించేందుకే రెండు విడతలుగా సీఎం క పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఒక నిరంతర ప్రక్రియ లాగా దీనిని ప్రతి సంవత్సరం కొనసాగిస్తామని తెలిపారు. క్రీడల్లో విజయం సాధించాలంటే కేవలం ప్రభుత్వ ప్రోత్సాహం మాత్రమే క్రీడాకారులకు కృషి పట్టుదల ఉండాలని అప్పుడు మాత్రమే క్రీడాకారులు చాంపియన్లుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు.యువ క్రీడాకారులకు సైనా నెహ్వాల్ వంటి క్రీడాకారుల జీవితం స్ఫూర్తి కావాలని ఆయన అన్నారు.సీఎం క పోటీలో పాల్గొన్న క్రీడాకారుల ప్రతించి వారికి స్పోర్ట్స్ స్కూల్లో అకాడమీ లలో అవసరమైతే ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు.స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ ,తెలంగాణ క్రీడా ప్రతిభ గుర్తింపు కొరకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఇది నిరంతరం జరిగే ప్రక్రియ లాగా ముందుకు వెళ్తామని తెలిపారు.క్రమశిక్షణ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు, ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ పోటీల విజయవంతంలో క్రీడా సంఘాల భాగస్వామ్యం ఎంతో ఉందని, ఎన్నో ప్రభుత్వ శాఖలు విభాగాలు సహకారం వల్లనే పోటీలు విజయవంతంగా కొనసాగాయని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ, సీఎం క పోటీలలో దాదాపు 5 లక్షల 40 వేల మంది క్రీడాకారులు ఆన్లైన్లో నమోదు చేసుకోగా, వారి సంపూర్ణ సమాచారాన్ని క్రీడా అవసరాలకు అనుగుణంగా క్రోడీకరిస్తున్నామని తెలిపారు.

ఓవరాల్ ఛాంపియన్ గా అదిలాబాద్..

గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా రాష్ట్రస్థాయి ఐదుఅంచల్లో కొనసాగిన ఈ పోటీల్లో అది ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్ గా నిలబడగా, రెండో స్థానంలో రంగారెడ్డి జిల్లా మూడో స్థానంలో కరీంనగర్ జిల్లా నిలిచాయి.విజేతలకు మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి సైనా నెహ్వాల్ సోని బాలాదేవిలు ట్రోఫీలు అందజేశారు.సీఎం కప్ పోటీల విజయవంతంకి కృషిచేసిన వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థలకు స్పోర్ట్స్ అథారిటీ ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలను బహూకరించింది. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల డివైఎస్ఓ లు, క్రీడా సంఘాల ప్రతినిధులు స్పోర్ట్స్ అథారిటీ కోచులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఐస్ క్రీమ్ ఇప్పిస్తామని చిన్నారి పై అత్యాచారం

- మహాదేవపూర్లో మహా దారుణం
- ఐదేళ్ల పసికందుపై అఘాయిత్యానికి పాల్పడ్డ ఇద్దరు మైనర్లు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

విశ్వంభర, మహాదేవపూర్ : సభ్య సమాజం తలదించుకునేలా ఐదేళ్ల చిన్నారిపై ఇద్దరు మైనర్ బాలుర్లు అత్యాచారానికి ఒడిగట్టిసంఘటన మహాదేవపూర్ మండలంలో చోటు చేసుకోవడం జరిగింది. వివరాల్లోకి వెళితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ఆదివారం రోజు, మండల కేంద్రానికి చెందిన ఓ ఐదు సంవత్సరాల చిన్నారి, తన ఇంటి ముందు ఆడుకుంటున్న క్రమంలో, పక్క వీధికి చెందిన ఇద్దరు మైనర్ బాలురు ఐస్ క్రీమ్ ఇప్పిస్తామని తీసుకువెళ్లి చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడడం జరిగింది. చిన్నారిపై అత్యాచారం చేసిన ఇద్దరు మైనర్లు ఒకరు 7 వ తరగతి మరొకరు 9వ తరగతి చదువుతున్నవారు.మహాదేవపూర్ మండలంలో పసికందుపై జరిగిన అఘాయిత్యం, మండలంతో పాటు జిల్లా మరియు రాష్ట్ర వ్యాప్తంగా, సంచలనంగా మారింది. ఆదివారం రోజు ఉదయం 10 గంటల సమయంలో ఇంటి వద్ద నుండి తీసుకువెళ్లిన ఇద్దరు మైనర్ బాలురు సుమారు నాలుగు నుండి ఆరు గంటల వరకు, చిన్నారిని చిత్రహింసలకు గురి చేస్తూ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తుంది. ఆదివారం రాత్రి తల్లిదండ్రులకు, ఆ చిన్నారి భరించలేని కడుపునొప్పి వస్తుందని చెప్పడంతో, హాస్పిటల్ తీసుకువెళ్లిన తల్లిదండ్రులకు చిన్నారిపై అత్యాచారం జరిగిందని తెలవడంతో కన్నీరు మున్నీరయ్యారు ఆ తల్లిదండ్రులు, తన కూతురుపై ఇద్దరు మైనర్లు అత్యాచారానికి పాల్పడ్డారని, చిన్నారి తండ్రి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది.

ఐదేళ్ల పసికందుపై అఘాయిత్యానికి పాల్పడ్డ ఇద్దరు మైనర్లు..

మండల కేంద్రానికి చెందిన ఇద్దరు మైనర్లు ఇంటి ముందు ఆడుకుంటున్న ఐదు సంవత్సరాల చిన్నారిని ఐస్ క్రీమ్ ఇప్పిస్తామని తీసుకువెళ్లి, చిన్నారిపై హత్యాచారానికి పాల్పడడం, ఆదివారం జరిగిన సంఘటన మంగళవారం నాటికి వెలుగులోకి రావడం, స్థానిక ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తూ కంటతడి పెట్టించింది, ప్రస్తుతం చిన్నారి జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది, అగైత్యానికి పాల్పడ్డ ఇద్దరు మైనర్లను పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలుస్తుంది.

హర్మూజ్ దాటాలంటే ఎవరి అనుమతి అక్కర్లేదు: భారత్

విశ్వంభర, నేషనల్ బ్యూరో : పర్షియన్ గల్ఫ్లో నిలిచిన ఇంధన, సరకు రవాణా నౌకలు హర్మూజ్ జలసంధి మీదుగా సురక్షితంగా వెళ్లేలా భారత్ సహా ఆయా దేశాలు ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఏదో ఒక రకమైన ఒప్పందం కుదుర్చుకుంటేనే భారత నౌకలకు ఇరాన్ అనుమతిస్తోందంటూ వస్తోన్న వాదనలను కేంద్రం తోసిపుచ్చింది. నౌకలు ఈ జలసంధిని దాటాలంటే ఏం దేశం నుంచి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఓడరేవులు, నౌకాయానం, జల మార్గాల మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎల్పీజీ తదితర సరకు రవాణా నౌకలను సురక్షితంగా తీసుకువచ్చేందుకు ఇరాన్ నుంచి భారత్ అనుమతి తీసుకుందా? ఏమైనా డబ్బులు చెల్లించిందా? అన్న ప్రశ్నలకు ఆర్కే సిన్హా సమాధానమిచ్చారు. హర్మూజ్ జలసంధి అంతర్జాతీయ నౌకాయాన ఒప్పందాల పరిధిలోకి వస్తుందని, ఆ మార్గంలో నౌకాయానానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుందన్నారు. అక్కడ ప్రయాణించాలా? వద్దా? అన్న విషయంపై షిప్పింగ్ కంపెనీ, నౌకను అద్దెకు తీసుకున్న సంస్థలు మాత్రమే నిర్ణయం తీసుకుంటాయన్నారు. ప్రస్తుతం అక్కడ నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో నౌకల భద్రతపై ఆయా సంస్థలు తాజా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటాయన్నారు. మరోవైపు, పర్షియన్ గల్ఫ్లో ప్రస్తుతం సుమారు 500 నౌకలు చిక్కుకొని ఉన్నట్లు అంచనా. వీటిలో 108 ముడిచమురు ట్యాంకర్లు, 166 చమురు ఉత్పత్తుల ట్యాంకర్లు, 104 రసాయన సంబంధిత ట్యాంకర్లు, 52 రసాయన ట్యాంకర్లతోపాటు మరిన్ని ఇతర నౌకలు ఉన్నట్లు సమాచారం. అయితే, శత్రు దేశాలు మినహా మిగతా దేశాల నౌకలను అనుమతిస్తామని ఇరాన్ ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా నౌకలను సులువుగా గుర్తు పట్టేందుకు వీలుగా ఇరాన్ ఆధీనంలో ఉన్న లారక్ఖేమ్ మార్గంలో ఆయా నౌకలు వెళ్తున్నట్లు తెలుస్తోంది.

కర్ల రాజేష్ లాకప్ డెత్ విచారణ వేగవంతం చేయండి : మంద కృష్ణ మాదిగ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : కొదాడకు చెందిన కర్ల రాజేష్ లాకప్ డెత్ పై విచారణ వేగవంతం చేయాలని ఎమ్ఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు , పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. పది అంశాలను ప్రస్తావిస్తూ పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కర్ల రాజేష్ లాకప్ డెత్ కు ప్రధాన కారకుడైన చిలుకూరు పోలీస్ స్టేషన్ కు అధికారిగా ఉన్న సురేష్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని కొరారు. లాకప్ డెత్ జరిగిన సమయంలో విధులలో ఉన్న కొదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి విధి నిర్వహణలో పూర్తి నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. కోదాడ నూతన డిఎస్పీగా బాధ్యతలు తీసుకున్న శ్రీ నివాస్ రెడ్డి కూడా కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లే తెలిపారు. సూర్యపేట జిల్లా ఎస్పీ నరసింహా పై కూడా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ లోని సెక్షన్ 4 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేదల సంక్షేమమే లక్ష్యం.. బీఆర్ఎస్ ఆరోపణలు రాజకీయ నాటకమే : కాంగ్రెస్ ఎమ్మెల్సీలు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోయేలా రూపొందించిందని, విపక్ష సభ్యులు మాత్రం రాజకీయ ఉనికి కోసం విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు అగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం శాసనమండలిలో బడ్జెట్ సభ్యులు బల్మూరి వెంకట్, బొగ్గరపు దయానంద్, శంకర్ నాయక్ మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. గత బీఆర్ఎస్ పాలనలో శంకుస్థాపన చేయడం తప్ప ప్రాజెక్టుల పనులు చేపట్టలేదని, గుత్తేదార్ల నుంచి కమీషన్లు మొత్తంలో తీసుకున్నారని వారు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పాటు పడుతుంటే ఓర్వలేక విమర్శలు చేస్తూ ప్రజల కోసం కోట్లాడుతున్నామని ఘోజులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. వారి పాలన జరిగిన అభివృద్ధి, దోపిడీ చూస్తే ఇతర రాష్ట్రాలు ఆశ్చర్య పోయాయని అన్నారు. బడ్జెట్లో విద్య, వైద్య, సంక్షేమ రంగానికి పెద్ద మొత్తంలో కేటాయింపులు జరిగాయని, రైతులకు పెట్టుబడి సాయం, రుణమాఫీ, ధాన్యం కొనుగోలు చేస్తే మద్దతు కల్పించామని, సన్నాలు పండించిన రైతులకు బోనస్ ఇప్పటి వరకు ఏ రాష్ట్రం ఇవ్వలేదన్నారు. యూరియా యాప్తో రైతులు రోజు తరబడి బస్తాల కోసం క్యూలైన్ లో నిలబడే అవసరం లేకుండా పోయిందని, ప్రతి రైతులకు యూరియా సరఫరా జరిగి, బ్లాక్ మార్కెట్ అమ్మకాలు జరగకుండా నియంత్ర చేశామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, పేదలకు కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు, నెలకు 6 కిలోల సన్నబియ్యం పంపిణీ చేసి పేదల గుండెల్లో నిలిచామని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం దోపిడీకి గురైందని, ఆయన కుటుంబ సభ్యులతో పాటు, ఎమ్మెల్యేలు భూకబ్జాలు, ప్రాజెక్టులో కమీషన్లు తీసుకొని కోట్లకు పడగలెత్తారని వారు తీవ్ర ఆరోపణలు చేశారు.

అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలకు సహకారం అందించాలి

విశ్వంభర, మీర్పేట్ : మీర్పేట్ డివిజన్ పరిధిలోని జిల్లెలగూడ ఎక్స్ రోడ్, మీర్పేట్ ఎక్స్ రోడ్ వద్ద నిర్వహించే డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి, బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సహకారం అందించాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం తరఫున సంబంధిత డిప్యూటీ కమిషనర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ గజ్జల రాంచందర్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం, విద్య, స్వాభిమానానికి మార్గదర్శకులైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గత 1986 సంవత్సరం నుంచి ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కూడా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అనుమతులు, విద్యుత్, పారిశుద్ధ్య ఏర్పాట్లు మరియు ఇతర మౌలిక వసతులు కల్పించాలని ఆయన కోరారు. అంబేద్కర్, పూలే, బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను యువతలోకి తీసుకెళ్లడం సమాజాభివృద్ధికి ఎంతో అవసరమని, అందుకు అధికారులు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గొట్టె శివరాజ్, అవుల కృష్ణ తదితర సభ్యులు పాల్గొన్నారు.